నవతెలంగాణ
నవ్యత తెలుగు దినపత్రిక
మెదక్
1
గురువారం | 06 జూన్ 2024 | www.navatelangana.com

కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జిల్లా జడ్జి



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట కోర్ట్ ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కె. సాయి రమాదేవి మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి తో కలిసి పర్యావరణ ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రములో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లే, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి చందన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావని యాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు హరిచంద్ర, బాబు రావు, సత్య నారాయణ, ఆత్మ రాములు, కోర్ట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు...

దుబ్బాకలో గాలివాన బీభత్సం

- పలుచోట్ల విరిగిన చెట్లు.. నేలకొరిగిన విద్యుత్తు స్తంభాలు





నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. బుధవారం వీచిన భారీ ఈదురుగాలులు, వర్షాలకు పలుచోట్ల చెట్లు విరిగి సమీప ఇండ్లపై పడ్డాయి. పురపాలిక పరిధిలోని లచ్చపేట 10, 11 వార్డుల్లో చెట్ల కొమ్మలు విరిగి ఇండ్లపై, కొన్నిచోట్ల విద్యుత్ తీగలపై పడ్డాయి. 3 చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలువురు ఇండ్లపై పెట్టుకున్న ప్లాస్టిక్ నీటి ట్యాంకులు, ఇంటిపై బిగించుకున్న ఇనుప రేకులు కొట్టుకుపోయాయి. దీంతో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దుబ్బాక నుంచి భూంపల్లి వెళ్లే దారిలో చెట్ల కొమ్మలు విరిగి దారికి అడ్డంగా పడ్డాయి. రామక్కపేటలో ట్రాన్స్ ఫార్మర్ కింద పడింది. స్థానికులు, తమ సిబ్బందితో కలిసి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టామని విద్యుత్ ఏఈ రామాంజనేయులు తెలిపారు.

సాగుకు సన్నద్ధం



- ముందస్తు వర్షాలు...దుక్కులు దున్నిన రైతులు
- అక్కడక్కడ పత్తి విత్తనాలు విత్తే పనులు షురూ
- వరి సాగు పొలాల్లో పచ్చిరొట్ట సాగు పనులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో విత్తనాలు, ఎరువులు సిద్ధం

ఖరీఫ్ సీజన్ పంటల సాగు కోసం రైతులు సన్నద్ధమయ్యారు. ముందస్తు వర్షాలు కురియడంతో ఇప్పటికే వేసవి దుక్కులు దున్నారు. పత్తి విత్తనాలు విత్తే పనులు షురూ అయ్యాయి. జూన్ మొదటి వారంలోనే నైరుతీ రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా వర్షాలు పడుతుండడంతో మెట్ట పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల్ని రైతులకు అందుబాటులో ఉంచారు. విత్తనాల కొరత, కల్తీ విత్తనాల విక్రయాలపై వ్యవసాయ శాఖ నిఘా పెట్టి తనఖీలు చేస్తోంది. పచ్చిరొట్ట విత్తనాల కొరత ఏర్పడకుండా కలెక్టర్లు చర్యలు తీసుకున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

నైరుతీ రుతుపవనాల ప్రభావంతో ఈ ఏడాది సాధారణ వర్షాపాతానికి మించి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అన్నట్టుగనే ఈ నెల మొదటి వారంలోనే వర్షాలు పడుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ పంటల సాగు ఆశాజనకంగా ఉండనుంది. మెదక్, సిద్ది పేట జిల్లాల్లో అత్యధికంగా వరి సాగవనుంది. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలో పత్తి పంట అత్యధికంగా సాగు కానుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మెదక్ జిల్లాలో పత్తి నామామాత్రంగా వేస్తారు. కంది, పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న, చెరకు, ఆలు, ఉల్లి వంటల సాగు ఆశించిన మేరకు సాగయ్యే అవకాశముంది. వర్షాధారంగా సాగు చేసే పత్తి, జొన్న, మొక్కొజొన్న, కంది, పెరస, మినుము వంటి పంటల సాగు కోసం రైతులు ఇప్పటికే విత్తనాలు, ఎరువుల్ని సేకరించుకుని పెట్టుకున్నారు. వరుసగా వర్షాలు కురిస్తే ఈ నెల రెండో వారంలోనే మెట్ట పంటలు సాగవనున్నాయి.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 17.50 లక్షల ఎకరాల్లో సాగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట మూడు జిల్లాల్లో కలిపి ఈ ఖరీఫ్ సీజన్‌లో 17.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కానున్నాయి. మూడు జిల్లాల వ్యవసాయ శాఖ ఇప్పటికే ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణాన్ని అంచనా వేశారు. సంగారెడ్డి జిల్లాలో 724405 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవనున్నాయి. ఇందులో పత్తి 3.60 లక్షల ఎకరాలు, వరి 1.50 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 14200, సోయాబీన్ 77600 ఎకరాలు, కంది 79500 ఎకరాలు, మినులుము 6300 ఎకరాలు, పెసర 9800 ఎకరాలు, చెరకు 25000 ఎకరాల్లో సాగవనున్నాయి. వీటితో ఉల్లి, ఆలు, జొన్న వంటి పంటలు కూడా వేయనున్నారు. మెదక్ జిల్లాలో 379509 ఎకరాల్లో వివిధ పంటలు సాగవనున్నాయి. ఇందులో అత్యధికంగా వరి 327113 ఎకరాలు, పత్తి 40619 ఎకరాలు, మొక్కజొన్న 2830 ఎకరాలు, కందులు 1125 ఎకరాలు, చెరకు, మినుములు, పెసర వంటి పంటలు సాగుకానున్నాయి. సిద్దిపేట జిల్లాలో 7.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేయనున్నారు. ఇందులో పత్తి 3.50 లక్షల ఎకరాలు, వరి 3.50 లక్షల ఎకరాలు, పెసర, మినుములు, సోయాబీన్, మొక్కజొన్న, కందుల వంటి పంటలు మరో 50 వేల ఎకరాల్లో సాగుకానున్నాయి.

విత్తనాలు ఎరువులు సిద్ధం

ఖరీఫ్ పంటల సాగు కోసం అవసరమైన విత్తనాలు, ఎరువుల్ని రైతులకు అందుబాటులో ఉంచేందుకు మూడు జిల్లాల్లో వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. మూడు జిల్లాల్లో కలిపి 7.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగుకానుంది. ఇందు కోసం 15 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరముంది. ఇప్పటికే వివిద కంపెనీల విత్తనాల్ని డీలర్ల వద్ద స్టాక్ పెట్టారు. మరో ఐదారు లక్షల ప్యాకెట్లు జిల్లాలకు రావాల్సి ఉంది. వరి పంట 8.50 లక్షల ఎకరాల్లో సాగవనుంద. ఇందు కోసం అవసరమైన విత్తనాల్ని కూడా వ్యాపారులు, డీలర్ల ద్వారా విక్రయిస్తున్నారు. మూడు జిల్లాల్లోనూ పచ్చిరొట్ట విత్తనాలు అవసరముంది. 15 వేల క్వింటాళ్ల వరకు జీలుగ, జనుము విత్తనాల్ని తెప్పించారు. అక్కడక్కడ కొరత ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందారు. దీంతో మూడు జిల్లాల కలెక్టర్లు జోక్యం చేసుకుని సమస్యల్లేకుండా చేశారు. కంది, పెసర, మొక్కజొన్న, మినుములు, సోయాబీన్ విత్తనాల్ని కూడా సరిపడ తెప్పించి రైతులుకు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. పాటల సాగు కోసం కావాల్సిన డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, పురుగుమందులు కూడా అందుబాటులో ఉంచారు.

ఆశాజనకంగా నైరుతీ వర్షాలు

జూన్ మొదటి వారంలోనే నైరుతీ రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల్లోనూ రెండు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. సాధారణ వర్షాపాతం కంటే అధిక వర్షాలు కురుస్తాయంటున్నారు. దీంతో వర్షాధార పంటల సాగు పనుల్ని రైతులు షురూ చేశారు. ఇప్పటికే వేసవి దుక్కులు దున్నారు. వర్షాలు పడుతుండడంతో సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో కొన్ని చోట్ల రైతులు ముందస్తుగనే పత్తి విత్తనాలు విత్తుకుంటున్నారు. జూన్ రెండో మూడో వారంలోనే మెట్ట పంటల విత్తనాలు విత్తుకుం టారు. జులై వరకు భారీ వర్షాలు కురిస్తే ప్రాజెక్టులు, చెర్వులు, కుంటల్లోకి నీరు చేరుతుంది. తద్వారా భూగర్భ జలాలు పెరగడం, కాల్వల ద్వారా పంటలకు సాగు నీరు విడుదల చేయడంతో వరి, ఇతర నీటి ఆధారిత పంటల సాగు పనులు జరుగుతాయి. ఇప్పటికే వరి నార్లు పోసేందుకు పొలాల్ని దున్నుకుని సిద్ధం చేస్తున్నారు.

అక్రమ ల్యాండ్ గ్రాబింగ్ ముఠా గుట్టురట్టు

పోలీసుల అదుపులో 10 మంది నిందితులు

వివరాలు వెల్లడించిన ఎస్పీ చెన్నూరి రూపేష్





నవతెలంగాణ-సంగారెడ్డి

అక్రమ ల్యాండ్ గ్రాబింగ్‌కు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టురట్టు అయింది. పది మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ చెన్నూరి రూపేష్ వివరాలు వెల్లడించారు.

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల పరిధిలోని ఖమ్మం పల్లి గ్రామ పరిధిలో హైదరాబాద్‌కు చెందిన పెండ్యాల హరి నాద్ బాబుకు సంబంధించిన సర్వే నంబర్ 198, 251లలో గల భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి తల్వార్, కత్తులతో బెదిరించారని.. బూతు మాటలతో తిడుతూ దాడికి కూడా యత్నించారని మే 26న గాడిపర్తి రవీందర్ అనే వ్యక్తి మునిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేయగా అసలు విషయం బయటపడింది.

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన అత్రియా ఇన్‌ఫ్రా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మంతెన రామకృష్ణ శ్రీనివాస్ వర్మ (ఎంఆర్ఎస్‌వర్మ).. మునిపల్లి మండల పరిధిలో 100 ఎకరాలు ఇప్పిస్తానని పెండ్యాల హరినాథ్ బాబుకు చెప్పాడు. అంతేకాకుండా దాన్ని డెవలప్మెంట్ పనులు చేస్తామని ఎంఓయూ చేసుకుని రూ.30 కోట్లు కూడా హరినాథ్ బాబు వద్ద నుంచి ఎంఆర్ ఎస్ వర్మ తెచ్చుకున్నాడు. అయితే 70 ఎకరాల భూమిని రిజిస్టర్ చేసి ఇవ్వడం.. అందులోనూ ఆ 70 ఎకరా ల్లోనే 10 ఎకరాల భూమిని డబుల్ రిజిస్ట్రేషన్ చేసినట్టు హరి నాథ్ బాబుకు తెలిసింది. ఈ విషయంలో రామకృష్ణ శ్రీనివాస్ వర్మను చాలా సార్లు అడిగిప్పటికీ.. అతను పట్టించుకోలేదు. దాంతో వారిద్దరి మధ్య తగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో హరినాథ్ బాబుపై రామకృష్ణ శ్రీనివాస్ వర్మ తీవ్ర కోపాన్ని పెంచుకున్నాడు. కిరాయి రౌడీలతో దాడి చేసైనా.. భూమిని లాక్కొవాలని భావించాడు. ఈ నేపథ్యంలో తన వద్ద పనిచేస్తున్న గణపతి రాజు శ్రావణ్ వర్మ, గట్టు ముక్కల భరత్ వర్మ, పి అశోక్ రెడ్డి, పాషాలకు విషయాన్ని వివరించాడు. ఈ నలుగురు వ్యక్తులు వారికి తెలిసిన అఖిల్ అనే వ్యక్తిని సంప్రదించి.. 10 మంది కిరాయి మనుషులు కావాలని చెప్పారు. అఖిల్ ఆన్‌లైన్‌లో జస్ట్‌డయల్ ద్వారా ఆనందరావు అనే వ్యక్తిని సంప్రదించాడు. సదాశివపేట దగ్గరలో ఉన్న 3000 ఎకరాల భూమి విషయంలో తగాదాలు ఉన్నాయని.. సమస్య పరిష్కారానికి 15 రోజుల కోసం 10 మంది ఆయుధాలతో వచ్చే కిరాయి మనుషులు కావాలని రూ.3,50,000 డీల్ మాట్లాడుకున్నారు. ఓ పక్కా ప్రణాళిక ప్రకారం.. గత నెల 25న(26-05-2024) ఆనందరావు, పప్పుసింగ్‌లు తమతో పాటు మరో 8 మందిని తీసుకుని తల్వార్లు, కత్తులు మరియు కట్టెలతో ఓ తుఫాన్ వాహనంలో హైదరాబాద్ నుంచి బయలు దేరి మునిపల్లి కంకోల్ టోల్‌గేట్ దగ్గర శ్రావణ్ వర్మ, భరత్ వర్మ, అశోక్ రెడ్డి, పాషాలను కలుసుకున్నారు. అక్కడి నుంచి భూమి వద్దకు చేరుకుని.. అక్కడ పనిచేస్తున్న వ్యక్తులను కత్తులు మరియు కట్టెలతో బెదిరించారు. అంతేకాకుండా వారిపై దాడిచేయడానికి కూడా ప్రయత్నించారు. దాంతో ఆ వర్కర్స్ అందరూ అక్కడి నుంచి భయపడి పారిపోయారు. అనంతరం శ్రావణ్ వర్మ, భరత్ వర్మ, అశోక్ రెడ్డి, పాషా లు రెండు జేసీబీలను తెప్పించి అక్కడ భూమి చుట్టూ ఉన్న అందాజా 800 కడీలను విరగగొట్టారు. అసలు విషయం తెలియడంతో 1) గణపతి రాజు శ్రావణ్ వర్మ ఏ శ్రవణ్, 2) గట్టు ముక్కల భరత్ వర్మ, 3) పి. అశోక్ రెడ్డి 4) పాషా వారి స్నేహితుడైన అఖిల్, 10 మంది కిరాయి మనుషలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 4-సెల్‌ఫోన్‌లు, టూఫాన్ వాహనం, ఓ జేసీబీ, ఒక కత్తి (తల్వార్), బాంబో కర్రలు స్వాధీన పర్చుకున్నారు. సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్యగౌడ్ పర్యవేక్షణలో, కొండాపూర్ ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య, సదాశివపేట ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్, మునిపల్లి ఎస్ఐ సురేష్ సిబ్బంది అందురూ కలిసి చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నారని ఎస్పీ అభినందించారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమంచి ల్యాండ్ గ్రాబింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పర్యావరణ రహిత ఉత్పత్తి గ్రీన్ వేస్ లక్ష్యం

గ్రీన్‌వేస్ అధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు
ప్లాంట్ ఆవరణలో పిల్లలతో కలిసి మొక్కలు నాటిన యాజమాన్యం



నవతెలంగాణ-బెజ్జంకి

పర్యావరణ రహిత ఉత్పత్తి చేయడమే గ్రీన్ వేస్ లక్ష్యమని గ్రీన్ వేస్ ఇథనాల్ పరిశ్రమ ఎండీ రాజీవ్ చడ్డ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల పరిధిలోని గుగ్గిల్ల గ్రామ శివారు గ్రీన్ వేస్ పరిశ్రమ అవరణ యందు ఎండీ దంపతులు రాజీవ్ చడ్డ, షర్మిల చడ్డ విద్యార్థులు, పరిశ్రమ ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. ఆధునిక కాలంలో పెరుగుతున్న భూతాపాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా మొక్కలు నాటాలని రాజీవ్ చడ్డ పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, క్యాప్స్ అందజేశారు. చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ విజయ్ బలరాం, జీఎం రామార్జున్, ప్రాజెక్టు ఇంజనీర్ సమీమ్, ప్రాజెక్ట్ మేనేజర్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుద్ఘాతంతో మూడు గేదెలు మృత్యువాత

జీవనోపాధి కోల్పోయా : బాధిత రైతు కన్నీటి వేదన



నవతెలంగాణ-గుమ్మడిదల

గాలి దుమారంతో విద్యుత్ వైర్లు తెగిపడటంతో ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై మూడు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన గుమ్మడిదల 33 కెవి సబ్‌స్టేషన్ వెనకాల ఉన్న పంట పొలాల్లో జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..

గ్రామానికి చెందిన పాదాల కృష్ణ తనకున్న మూడు గేదెలను మేతకు తీసుకుని వెళ్తుండగా.. అంతకుముందే అక్కడ స్తంభం నుంచి తెగిపడిన విద్యుత్ వైరు ఉండటం గమనించలేదు. ఈ క్రమంలో మేత మేసుకుంటూ వెళ్తున్న పశువులు వైర్‌కు తగలడంతో విద్యుద్ఘాతానికి గురై మూడూ గేదెలు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు ఏడిఏ శ్రీకాంత్, ఏఈ రవీందర్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ క్రమంలో గేదెల యజమాని విద్యుత్ అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమయ్యాడు. తనకున్న మూడు పశువులు మృతి చెందడంతో జీవనోపాధి కోల్పోనని.. తన కుటుంబాన్ని ఎలా పోషించాలని వాపోయాడు. తనకు తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు. అనంతరం విద్యుత్ అధికారులు మాట్లాడుతూ.. ఈ విషయాన్ని జిల్లా విద్యుత్ ఉన్నత అధికారులకు తెలియజేసి.. బాధిత కుటుంబానికి నష్టపరిహారం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గేదెలకు పశువైద్య అధికారి పంచనామా చేశారు. మృతి చెందిన గేదెలు రూ.3లక్షల విలువ ఉంటాయని.. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

ప్రయివేటు పాఠశాల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

నవతెలంగాణ-సదాశివపేట

ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని.. అలాగే విద్యాసంస్థల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వరంలో మండల విద్యాధికారికి మెమోరాండం అందజేయాలనుకోగా.. అధికారి లేకపోవడంతో ఖాళీ కుర్చీకే ఇచ్చారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. నూతన విద్య సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ ప్రైవేటు కార్పొరేటు పాఠశాల యజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా అసత్య ప్రచారాలు చేస్తూ అడ్మిషన్లు చేయిస్తున్నాయని ఆరోపించారు. అలాంటి పాఠశాలల పైన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అలాగే ప్రైవేటు యజమాన్యాలు అడ్మిషన్ల పేరుతో రూ.5000 నుండి పదివేల వరకు విద్య హక్కు చట్టానికి విరుద్ధంగా ఎలా తీసుకుంటారని మండిపడ్డారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలన్నారు. అదేవిధంగా సదాశివపేటలో ఉన్న ప్రయివేటు పాఠశాలల్లో బెస్ట్ అవైలబుల్ సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో టీసీలు, బోనఫెడ్లు ఉచితంగా ఇవ్వకుండా అధిక ఫీజులు వసూలు చేయడాన్ని అరికట్టాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీకాంత్, నాయకులు కృష్ణ, సుధాకర్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.



కష్టపడ్డాం.. తృటిలో చేజార్చుకున్నాం

- బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు వల్లే ఓటమి
- ఓడిపోయామనే బెంగ వద్దు.
- నీలం మధుకు సీఎం భరోసా



నవతెలంగాణ-పటాన్‌చెరు

మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రేణులను కలుపుకుని నీలం మధు కష్టపడి పని చేసినా.. తృటిలో సీటును చేజార్చుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఫలితాలు వెలువడిన సందర్భంగా మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్.. మంత్రి కొండా సురేఖతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓటమి పట్ల బెంగ పడాల్సిన అవసరం లేదని నీలం మధును సీఎం సముదాయించారు. విజయం అంచుల దాకా వచ్చి చేజారిందని.. అంతమాత్రాన బాధపడాల్సిన పనిలేదన్నారు. ఓటమికి సంబంధించిన కారణాలను విశ్లేషణ చేసుకొని సమన్వయంతో ముందుకు వెళ్తూ.. ప్రజా పాలనలో పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని నీలంకు సీఎం సూచించారు. నీలం మధుకు నేనున్నానని, కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన నాయకులకు కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ధన్యవాదాలు తెలిపారు.

పేద విద్యార్థులకు 25శాతం ఉచిత సీట్లు ఇవ్వాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రయివేటు, కార్పొరేట్ ఇంటర్నేషనల్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు ఉచితంగా 25శాతం సీట్లు ఇవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. ప్రయివేటు, కార్పొరేట్ విద్య వ్యవస్థలో దోపిడి పెరిగిందని మండిపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారం భం అయ్యిందని.. ఉన్నతాధికారులు ఆయా పాఠశాలలను పరిశీలించాలన్నారు. విద్యారంగంలో జరుగుతున్న కార్పొరేట్ దోపిడీని అరికట్టాలన్నారు. అనేక ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ అనుమతి లేకుండానే విచ్చలవిడిగా ఏర్పాట్లు చేసుకుంటున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణకు చర్యలు తీసు కోవాలని ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్నేషనల్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా సీట్లు ఇవ్వాలని కోరారు. పాఠశాల ఫీజుల పట్టికను బహిరంగ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, రాజు, మల్లేశం, సహాయ కార్యదర్శులు ప్రవీణ్, మహేష్, దా సు, నాయకులు మహేష్, చంద్రశేఖర్, గంగారం మహేష్, నరేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



నీట్(యుజి) ఫలితాల్లో మెరిసిన సెయింట్ ఆంథోనీస్ విద్యార్థిని



నవతెలంగాణ-సంగారెడ్డి

నీట్ (యుజి) 2024 ఫలితాల్లో సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఆసిఫా ఫాతిమా 720 మార్కులకు గాను 426 మార్కులు సాధించి ఆలిండయా ఈడబ్ల్యూఎస్ విభాగంలో అత్యుత్తమ ర్యాంకు సాధించినందుకు కళాశాల ప్రిన్సిపాల్ ఈ జ్యోతి రెడ్డి విద్యార్థిని సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రముఖ వైద్య కళాశాలలో ఉచిత సీట్ పొందుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం



నవతెలంగాణ-కొండాపూర్

తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి.. బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన కొండాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కొండాపూర్ ఎస్ఐ హరిశంకర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన చాకలి చంద్రయ్య కుటుంబంతో కలిసి మంగళవారం రాత్రి శంకర్పల్లిలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లి.. తిరిగి బుధవారం ఉదయం వచ్చారు. ఇంటి వచ్చి చూసేసరికి ఐదు బీరువాలు పగలగొట్టి బంగారం, వెండి, నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్టు గమనించారు. వెంటనే చంద్రయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బండి సంజయ్‌కు ఆత్మీయ సన్మానం



నవతెలంగాణ-బెజ్జంకి

కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికైన బండి సంజయ్‌ను అయన కార్యాలయంలో బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్ వర్మ, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి అనీల్ రావు, బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాజిరెడ్డి మహిపాల్ రెడ్డితో కలిసి బండి సంజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శ్రీనివాస్

నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక పార్లమెంటు స్థానాలను గెలుపొందడం పట్ల జోగిపేట యూత్ కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల శ్రీనివాస్ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం హైదరాబాదులోని సీఎం నివాసంలో ఆయనను కలిశారు. జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఎంపీగా గెలుపొందిన సురేష్ షెట్కార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



రాజీమార్గమే రాజమార్గం

నవతెలంగాణ-రాయికోడ్



రాజీమార్గమే రాజ మార్గమని స్థానిక ఎస్సై వెంకట్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 8న జహీరాబాద్ కోర్టులో లోక్ అదాలత్ ఉంటుందన్నారు. మండలంలో యాక్సిడెంట్ చీటింగ్, భూ తగాదాలు, వివాహాల సంబంధానికి సంబంధించినవి, దొంగతనాలకు, అక్రమ రవాణా, పేకాట, లాక్‌డౌన్ కేసులకు సంబం ధించి లోక్‌అదాలత్ ద్వారా రాజీ చేసుకునే మార్గం ఉంటుందన్నారు. కాబట్టి ఫిర్యాదు దారులు, నిందితులు ఇరు వర్గాలు జూన్ 4 నుండి 8 వరకు పోలీస్ స్టేషన్లో హాజరుకావాలన్నారు. ఈ అవకాశాన్ని మండల లంలోని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.



'బీఏఎస్' విద్యార్థికి 9.8 జీపీఏ

అభినందించిన షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచకులు

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీఏఎస్ ఉచిత విద్యా పథకం ద్వారా సెయింట్ ఆంథోనిస్ శాంతినగర్ పాఠశాలలో చదువుతున్న బైండ్ల పవన్ ప్రకాష్ పదో తరగతిలో 9.8/10 జీపీఏ సాధించిన సందర్భంగా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచకులు టి.అఖిలేష్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టంతో చదివితే ఎలాంటి విజయాలన్న సాధించవచ్చునన్నారు. పేద విద్యార్థులకు బెస్ట్ అవైలబిలిటీ స్కూల్ ఎంతో ఉపయోగంగా ఉందని.. పేద విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఉత్తమ ఫలితం సాధించిన విద్యార్థిని.. సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేత ఈ.సాల్మోన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఈ.కరుణాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ ఈ.జయబాలరెడ్డి,అకాడమిక్ డైరెక్టర్ ఈ.విజయ కుమార్ రెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తూ తరగతులు నిర్వహిస్తున్న స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కొండాపూర్

ఈనెల 12వ తారీకున పాఠశాలను రీ-ఓపెన్ చేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ.. ఆ నిబంధనలు ఉల్లంఘిస్తూ పాఠశాలను ఓపెన్ చేయాలని చూసిన స్రవంతి విద్యానికేతన్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు సందీప్ డిమాండ్ చేశారు. స్కూల్ బస్సులో విద్యార్థులను తరలిస్తుండగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అడ్డగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండాపూర్ మండలపరిధిలోని మారేపల్లి గ్రామంలో గల స్రవంతి విద్యానికేతన్ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యార్థులను పాఠశాల బస్సులో తరలిస్తూ పాఠశాల ఓపెనింగ్ చేయాలని చూసిందన్నారు. కాబట్టి వెంటనే ఆ విద్యానికేతన్ యాజమాన్యం పై చర్య తీసుకోవాలన్నారు. బస్ ఫిట్నెస్ చేయించలేకుండా స్కూల్ బస్సు నడుపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో. బన్నీ, అర్జున్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

జహీరాబాద్ ఎంపీగా సురేష్ షెట్కర్‌ను భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు బుధవారం సంబురాలు జరిపారు. కాగా న్యాల్కల్ మండలంలోనే 6000 పైగా ఆయనకు మెజార్టీ దక్కడం గమనార్హం. మండలంలో అత్యధికంగా మీర్జాపూర్ (బి) గ్రామంలలో 508, అత్యల్పంగా వడ్డీ గ్రామంలో 49 ఓట్ల మెజార్టీ వచ్చింది. పార్టీ ముఖ్య నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, చంద్రప్ప, తిరుపతి రెడ్డి, గౌసొద్దీన్‌లు తీవ్రంగా శ్రమించి మెజార్టీ తీసుకురావడంలో సఫలీకృతమయ్యారు. సురేష్ షెట్కార్ మంచి మెజార్టీతో గెలుపొందించిన ప్రతీ ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

మిర్జాపూర్ (బి), వడ్డీ, టేకుర్, చాల్కి, చీకుర్తితో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టపాకాయలు కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ సంబురాలు చేసుకున్నారు. విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మిర్జాపూర్ (బి) జగనాథ్ రెడ్డి, షఫీయేద్దిన్, అశోక్‌రెడ్డి, సమీయేద్దిన్, వాజిద్, వడ్డీ సునీల్, మును పటేల్, నాగేష్, కార్యకర్తలు ఉన్నారు.



ఘనంగా జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మనూర్

మండలంలోని బెల్లాపూర్ మాజీ సర్పంచ్ కె.దిగంబర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా జరిపారు. ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవ్‌రెడ్డి నివాసంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధార్థరెడ్డి, మోహన్‌రెడ్డి, దత్తు, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు

నవతెలంగాణ-జహీరాబాద్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఘన విజయం సాధించడం పట్ల జహీరాబాద్ పట్టణంలోని రాంనాగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణాసంచా, టపాసులు కాల్చి అభిమానులు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా త్రిమేన్ కమిటీ సభ్యులు సురేష్ మాట్లాడుతూ.. ఆంధ్రాలో 150 కి పైగా స్థానాల్లో విజయం సాధించడం ఆనందరంగా ఉన్నదన్నారు. తెలంగాణలో కూడా టీడీపీ బలపడుతున్నదన్నారు. జరిగింది. ఈ కార్యక్రమంలో త్రిమేన్ కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ బండమీది శ్రీనివాస్, రాంచందర్, డి.కె.వెంకటేశ్వర్లు, చెంగల్ జైపాల్, నాగరాజ్, టీడీపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అమాంతం పెరిగిన బీజేపీ ఓట్లు

- మూడో స్థానానికి పరిమితమైన బీఆర్ఎస్
- లక్ష ఓట్లను సంపాదించిన కాంగ్రెస్ అభ్యర్థి
- తగ్గిన ఓట్లపై బీఆర్ఎస్, కాంగ్రెస్ సమాలోచనలు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ రెండో స్థానాన్ని కైవసం చేసుకోవడం నియోజకవర్గ పరిధిలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పలు గ్రామాల్లో కనీస ఓటు బ్యాంకు లేని బీజేపీ.. రెండో స్థానానికి ఎలా వచ్చిందని ఓటర్లు ప్రజాప్రతినిధులు అంచనాలు వేసుకుంటు న్నారు.జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా ఓట్లు సంపాదించడంతో బీఆర్ఎస్ మూడో స్థానానికి దిగజారింది.

రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రెండు పర్యాయాలు జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బిబి పాటిల్ రెండుసార్లు గెలిచారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో నామినేషన్‌కి కొన్ని రోజుల ముందే బీజేపీ చేరి అక్కడి నుండి జహీరాబాద్ స్థానానికి టికెట్ సంపాదించుకున్నారు. టికెట్ సంపాదించిన నాటి నుంచి విజయం కోసం బీబీ పాటిల్.. బీఆర్ఎస్ పార్టీలోని పలువురు నాయకులను బీజేపీలో చేర్చుకున్నారు. తమకు ఉన్న ఆర్థిక బలంతో ఓటర్లను సైతం తమ వైపు మలుపుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు తాము ఎలాగైనా ఓడిపోతున్నామని గ్రహించిన బీఆర్ఎస్ నాయ కులు పెద్ద మొత్తంలో తమ ఓటర్లందరినీ బీజేపీ వైపు మళ్ళించారని సర్వత్రా ఆరోపణలు ఉన్నాయి. దానికి అనుగుణ ంగానే బీజేపీ ఈసారి ఎన్నికల్లో అమాంతంగా తమ ఓటు బ్యాంకును మూడు లక్షల పై చిలుకు పెంచుకుంది. 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి లక్ష్మారెడ్డికి 1.38 లక్షల ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థికి 4.34 లక్షల పై చిలుకు ఓట్లు పోలై 6 వేల పైచిలుకు ఓట్లతో తమ ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన మదన్మోహన్‌పై బీ.బీ పాటిల్ గెలుపొందారు. నాడు కాంగ్రెస్ పార్టీకి 4.28 లక్షల పైచిలుకు ఓట్లు వచ్చాయి. అయితే ఈ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి ఒక్క లక్ష 72 వేలపై చిలుకు ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థికి నాలుగు లక్షల 82 వేల పైచిలుకు ఓట్లు సంపాదించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఐదు లక్షల 28 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. దాంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్ 50 వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు. 2019 ఎన్నికలతో పోల్చుకుంటే 2024 లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 1, లక్ష చిలుకు ఓట్లను సంపాదించుకోగలిగింది. బీజేపీ మూడు లక్షల పైచిలుకు ఓట్లను సంపాదించుకోగలిగింది. బీఆర్ఎస్ సుమారు మూడు లక్షల ఓట్లను కోల్పోవాల్సి వచ్చింది. దాంతో బీఆర్ఎస్‌కు చెందిన ఓట్లు నేరుగా బీజేపీకే అత్యధికంగా క్రాస్ ఓటింగ్ జరిగిందని.. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బీ.బీ పాటిల్‌కు ఉన్న నమ్మకంతో బీఆర్ఎస్‌కి చెందిన కార్యకర్తలతో ఉన్న సంబంధాలతో బీఆర్ఎస్ ఓట్లు పెద్ద సంఖ్యలో బీజేపీకి వెళ్లాయని విశ్లేషకులు భావిస్తున్నారు.



బీజేపీ ఓట్లు పెరగడానికి కారణం ఏంటి..

నెల రోజులకు ముందు బీఆర్ఎస్‌ను వదిలి బీజేపీలోకి వెళ్లిన బీబీ పాటిల్‌తో అనుకున్న స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వెళ్ళకపోయినప్పటికీ ఓట్లు ఎలా వచ్చాయని.. ఎక్కడ లోపం జరిగిందని బీఆర్ఎస్ అధిష్టానం అంచనా వేస్తున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో ఉండి పార్టీకి ద్రోహం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంతో.. ఆ పార్టీకి చెందిన నాయకులు గ్రామాల వారీగా తమ గ్రామంలో వచ్చిన లీడ్‌పై చర్చలు జరుపుతున్నారు. గెలుపోటములు మెజార్టీ సాధించడంలో ఏ పార్టీ నాయకులు ద్వితీయ శ్రేణి నాయకుల పై ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం













నవతెలంగాణ-జహీరాబాద్

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మెన్ కె.సూరికృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి జి. అనూష కోర్టు ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, మొక్కలు ద్వారా వాతావరణ కాలుష్యం తగ్గి, స్వచ్ఛమైన గాలి వీస్తుందన్నారు. తద్వారా రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని హితవు పలికారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం కోర్టు సిబ్బంది, న్యాయవాదులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ గోపాల్, వైస్ ప్రెసిడెంట్ మానెన్న, న్యాయవాదులు లీగల్ సర్వీసెస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పారాలీగల్ వాలంటీరు పాల్గొన్నారు.

రామచంద్రాపురం : నవరత్న కంపెనీల్లో ఒకటైన రామచంద్రాపురం భెల్ కంపెనీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు. పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేబీ రాజా జెండా ఊపి గ్రీన్ ర్యాలీని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని ఆయన కోరారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీని కొనసాగించారు.ఈ కార్యక్రమంలో కంపెనీ జనరల్ మేనేజర్లు, డీఆర్‌ఓలు,సిఐఎ స్ఎఫ్‌కమాండెంట్,సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు : పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పాశమైలారంలోని పార్లే పరిశ్రమలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కే.రాజయ్య, పరిశ్రమ జనరల్ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అందరూ మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. మొక్కలు నాటితే పర్యవారనాన్ని రక్షించిన వాళ్ళం అవుతామన్నారు. రోజురోజుకు దేశంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతుందని, కాలుష్యాన్ని అరికట్టేది పచ్చని చెట్లేనన్నారు. అందరూ మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌కరీం, యూనియన్ నాయకులు సంతోష్, రాజశేఖర్, సుజిత్,కిరణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ : మండల పరిధిలోని తొగర్‌పల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా.. ఎంపీడీవో జ్యోతిలక్ష్మి ఉపాధి హామీ కూలీలతో కేక్ కట్ చేయించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మనిషి స్వార్థ ప్రయోజనాలతో పర్యావరణాన్ని విస్మరిస్తే భవిష్యత్తులో మానవ మనుగడకు ముప్పుతప్పదన్నారు. చెట్లు నరికి వేయడంతో పర్యావరణంలో అతివృష్టి అనావృష్టి ఏర్పడుతున్నదన్నారు. తద్వారా పిచ్చుకలు,తూనిగలు, సీతాకోకా చిలుకలు అంతరించే దశలో ఉన్నాయన్నారు. వాహన కాలుష్యాన్ని నియంత్రించడానికి పర్యావరణాన్ని రక్షించడానికి కోట్లాది రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. కాలుష్య నివారణకు పచ్చదనాన్ని పెంచడమే పరిష్కారమార్గమన్నారు. భూమిని, పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడానికి ప్లాస్టిక్ కవర్లను చెత్త కుండీల్లో వేయాలని కోరారు. ప్లాస్టిక్ ఎంత ప్రమాదకరమో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్‌ని కంట్రోల్ చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కర్యాక్రమంలో ఏపీఓ వీరప్ప,టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రెటరీ, ఫీల్డ్‌అసిస్టెంట్ పాల్గొన్నారు.

జిన్నారం : మండల పరిధిలోని కాజిపల్లి పారిశ్రామి కవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక టీఐడీసీ పరిశ్రమ వద్ద పర్యావరణ దినోత్సవ వేడుకలను కార్మిక వర్గాలు ఘనం గా నిర్వహించాయి. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కంకణ బద్ధులై శ్రమించాలని సీఐటీయూ శ్రేణులు పిలుపునిచ్చాయి. మండలంలోని వివిధ పారిశ్రామిక వాడల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కార్మికులు, కార్మిక సంఘాలు, పరిశ్రమ వర్గాలు చేపట్టాయి.

కంది : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఏషియన్ పెయింట్స్ పటాన్చెరువు వారి సహకారంతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సమావేశాన్ని ఇంద్రకరణ్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సోషల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎల్లబోయిన సాంబరాజు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించడం మానవాళి తక్షణం బాధ్యత. విపరీతమైన వాతావరణ మార్పుల వల్ల మానవాళికి పెను ప్రమాదం ముంచుకొస్తుందన్నారు. అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు వరదలు, చలి తీవ్రత వంటి వాతావరణ మార్పుల వల్ల మానవ మనుగడ ప్రశ్నార్థక మవుతుందన్నారు. ఆధునిక జీవన శైలి వల్ల, అవసరాలకు మించి సహజ వనరులను వాడటం వల్ల భూమి, గాలి, నీరు కాలుష్యానికి బలవుతున్నాయన్నారు. అడవుల సంరక్షణ చర్యలు పాటించకపోవడం, గుట్టల తొలగింపు, గ్రానైట్ క్వారీలు, అవసరాలకు మించిన రియల్ ఎస్టేట్ దందా, చెరువులు విధ్వాసం వల్ల పర్యావరణం తీవ్రస్థాయిలో దెబ్బతింటుందన్నారు. కాబట్టి భవిష్యత్తు తరాలకు ఈ భూమిని నివాసయోగ్యంగా కొనసాగించటానికి ఇప్పుడే బాధ్యతగా పర్యావరణాన్ని సంరక్షించాలని, భూమిని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది డాక్టర్ ధరావత్ వినోద్, ఎండి అయాజుద్దీన్, శ్రీకాంత్ పాటిల్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం..



పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత..

నవతెలంగాణ-జహీరాబాద్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మహీంద్రా అండ్ మహీంద్రా ఏడిలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర, అధ్యక్షులు, మహీంద్రా అండ్‌మహీంద్రా యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, విస్తృతంగా చెట్లను నాటాలని, భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. పర్యావరణం దెబ్బతింటే ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. భూమిని పర్యావరణాన్ని కాపాడుకున్న ప్పుడే ప్రజలు సంతోషంతో, ఆరోగ్యవంతమైన వాతావరణంలో ఉంటారన్నారు. ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మహీంద్రా యాజమాన్యం చెట్ల పెంపకం కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహీంద్రాఅండ్‌మహీంద్రా-ఏడి ప్లాంట్ హెడ్ అనిల్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.మహిపాల్, ఆఫీసర్స్ మధు, రాందాస్, చంద్రశేఖర్, ప్రదీప్ గౌడ్, వేణుగోపాల్, తదితరులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-మునిపల్లి



విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని హెచ్చరించారు. మండలంలోని బుదేరా గ్రామంలో ఏడిఏ శ్రీనివాస ప్రసాద్‌తో కలిసి పద్మావతి ఫర్టిలైజర్స్‌లో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నూజివీడు కంపెనీకి చెందిన ఆద్య పత్తి విత్తనాలతో పాటు యుఎస్ 7067 మరో రకం పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు వారు గుర్తించారు. అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు వ్యాపారులు కూడా ఒప్పుకున్నారు. ఇందుకు సంబంధించి దాదాపు రూ.44 లక్షల విలువ చేసే సంబంధిత ఉత్పత్తులను విక్రయించొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. విత్తనాలను నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన విక్రయానికి సంబంధించిన రసీదును తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివకుమార్, మంజీరా రైతు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష పోకడలతోనే నీలం మధు ఓటమి

నవతెలంగాణ-జోగిపేట



మెదక్ లోకసభ నియోజకవర్గంలో ముదిరాజ్ కులానికి చెందిన నీలం మధుకు జాతీయ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించినా దాన్ని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని రాష్ట్ర ముదిరాజ్ మహసభ పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.నారాయణ ముదిరాజ్ అన్నారు. బుధవారం జోగిపేటలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. మెదక్ లోకసభ నియోజకవర్గంలో సుమారుగా మూడున్నర లక్షల మంది ముదిరాజ్ కులస్తులు ఉన్నారని, వారి మద్దతు కూడబెట్టుకోకుండా ఏకపక్షంగా ఎన్నికల్లో వెళ్లడం వల్ల గెలుపొందలేకపో యారన్నారు. రాజకీయ పరిజ్ఞానం లేని నాయకుల సలహాలతో ఎన్నికల్లో వెళ్లడం వల్లనే ఫలితాలు ఇలా వచ్చాయన్నారు. బీజేపీ తరపున పోటీ చేసిన ముదిరాజ్ బిడ్డ ఈటెల రాజేందర్ ఘన విజయం సాధించారన్నారు. బడుగు, బలహీన వర్గాల మద్దతు లేకుండా ఏమి సాధించ లేమన్న విషయాన్ని అభ్యర్థులు గమనించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా ముదిరాజ్ కులస్తులు రాజకీ యంగా పోటీ చేసే అవకాశం వచ్చినప్పుడు అందరిని కలుపు కొని పోవాలని ఆయన సూచించారు.

ఓటరు మహాశయులకు కృతజ్ఞతలు..

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు పట్టం కట్టిన ఓటరు మహాశయులకు రాష్ట్ర ముదిరాజ్ మహాసభ పోలిట్ బ్యూరో సభ్యులు బానిస నారాయణ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీ గెలిపించడం గర్వనీయవన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్రంలో అత్యధిక స్థానాలను గెలిపించారన్నారు. ముదిరాజ్ కులస్తుల సమస్యలను కూడా సీఎం తప్పకుండా నెరవేరుస్తారని నమ్మకం ఉన్నదన్నారు. ఎన్నికల్లో ముదిరాజులు కూడా కాంగ్రెస్కు మద్దతు పలికారన్నారు. సురేష్ షెట్కర్ గెలుపు పట్ల ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

సురేష్ షెట్కార్ గెలుపు పట్ల హర్షం

నవతెలంగాణ-జోగిపేట



జహీరాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు పట్ల అందోల్ జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ కృషి ఎంతో ఉన్నదన్నారు. 40వేల పైచిలుకు మెజార్టీని సురేష్ షట్కార్‌కు అందించడం పట్ల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల ప్రచారంలో ముం దుండి కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదపడ్డారన్నారు. దేశంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రజలు అత్యధిక స్థానాలను కట్టబెట్టి విశ్వాసం పొందారన్నారు. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ముందుంటుందన్నారు.

సురేష్ షెట్కార్‌ను గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు

నవతెలంగాణ-కల్హేర్



జహీరాబాద్ ఎంపీగా సురేష్ కుమార్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించిన జహీరాబాద్ పరిధిలోని పార్లమెంట్ ఓటర్ మహాశయులకు కల్హేరు మండల మాజీ ఎంపీపీ మల్లేశం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి.. చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను చూసి జహీరాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సురేష్ కుమార్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఈ మెజార్టీ కోసం గ్రామాల్లో కష్టపడిన ప్రతీ కార్యకర్తకు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మూడోసారి బీజేపీ కూటమి ప్రభుత్వం పట్ల హర్షం

- పేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విట్టల్



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

కేంద్రంలో మూడోసారి భారతీయ జనతా పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయనుండడం పట్ల పెద్ద శంకరంపేట బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విట్టల్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ కానున్నారని పేర్కొన్నారు. బీజేపీ కూటమి ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. పెద్దశంకరంపేట మండలంలో అత్యధిక సంఖ్యలో బీజేపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్ బుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలి

- జిల్లా ఎస్పి బాలస్వామి



నవతెలంగాణ-మనోహరాబాద్

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని కాలుష్య రహిత సమాజం కోసం పాటుపడాలని మెదక్ జిల్లా ఎస్పి బాలస్వామి పేర్కొన్నారు. వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే సందర్భంగా మనోహరాబాద్ మండలంలోని చెట్లగౌరారం గ్రామ శివారులో గల ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించడంలో కూడా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సీఐ క్రిష్ణ, మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డిలతో పాటు పరిశ్రమ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం రేగొండ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో చెట్లు నాటారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యావరణంపై ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పచ్చని చెట్టు ప్రగతికి మెట్టని అన్నారు. ఈ పర్యావరణాన్ని కలుషితం చేసే హక్కు ఎవరికీ లేదన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏఎన్ఎం చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ కొమురయ్య, పంచాయతీ సెక్రటరీ చిరంజీవి, ఏఎన్ఎం వనజ ఆశాలు, పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

- మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి



నవతెలంగాణ-సిద్దిపేట

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి అన్నారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోమటి చెరువు వద్ద రూబీ నెక్లెస్ రోడ్ లో మార్నింగ్ వాక్ చేసే పుర ప్రజలకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొన్ని రకాల కూరగాయల మొక్కలను డాక్టర్ స్వామి ఆధ్వర్యంలో ఆమే పంపిణీ చేశారు. అక్కడ పనిచేసే పారిశుద్ధ సిబ్బందికి సన్మానం చేశారు. సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్ నుంచి స్వచ్ఛ బడి వరకు మున్సిపల్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ బడిలో పర్యావరణానికి సంబంధించిన డాక్యుమెంటరీని మున్సిపల్ సిబ్బంది ప్రదర్శించడం జరిగింది. ఓల్డ్ బస్టాండ్ వద్ద స్కూల్ పిల్లలతో నృత్య ప్రదర్శన ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను జిల్లా ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ కే. శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు అంగన్వాడీ కేంద్రాల్లో హెచ్ బీ ఎన్ సీ కిట్లు, గర్భిణీలకు, బాలింతలకు, శిశువులకు, బాలామృతం, పౌష్టిక ఆహారం సరిగ్గా అందుతుందా ? అని పరిశీలించారు. గర్భవతులకు, పిల్లలకు, సరైన సమయంలో టీకాలు వేయించాలని అవగాహన కల్పించారు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కే రవీందర్, ఏవో, సీనియర్ అసిస్టెంట్ డేనియల్, డాక్టర్ మహతి, మాణిక్యమ్మ, శ్రవాణి, లత, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తెర్లుమద్ది, రాఘవపూర్ గ్రామానికి చెందిన వారు చికిత్స పొందుతున్న క్రమంలో రక్తం అవసరం కాగా రక్త దాతలు దాసరి కపిల్, మల్క వెంకట్ రెడ్డి, గొడుగు నాంపల్లి, ఇందూరి కనకరాజు రక్తం ఇవ్వడం జరిగిందని వాసవి క్లబ్ జాయింట్ ట్రెజరర్ పుల్లూరు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని, రక్తదానం చేయడం మూలంగా ఒకరి ప్రాణాన్ని కాపాడవచ్చునన్నారు. నాలుగు యూనిట్ల రక్తం ఇవ్వడం సంతోషంగా ఉందని, ప్రోత్సాహం చేస్తున్న వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడుని అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అరవపెల్లి హరికిరణ్, బ్లడ్ బ్యాంకు ఇన్చార్జ్ డాక్టర్ స్వాతి, ఇమ్రాన్, రమేష్, లెంకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బండి గెలుపుతో బీజేపీ శ్రేణుల్లో సంబరాలు.



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం మల్చేరువు తండాలో గిరిజన మోర్చా మాజీ మండలాధ్యక్షుడు భానోతు అనిల్ నాయక్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకున్న నిర్ణయాలే మరోసారి ప్రధాని మోడీ, ఎంపీ బండి సంజయ్ విజయానికి నాంది పలికాయన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధాని మోడీ నాయకత్వంలోనే సాధ్యమన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నంగునూరు

సిద్దన్నపేట గ్రామానికి చెందిన బొల్లు ఎల్లయ్య కుటుంబానికి గ్రామస్తులు, గ్రామ నాయకులు రూ.21 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని సిద్దన్నపేట గ్రామానికి బొల్లు ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయిన విషయం తెలిసిందే. పేద కుటుంబ పరిస్థితి తెలుసుకున్న గ్రామస్తులు ఏదైనా సహాయం చేయాలని నిశ్చయించుకున్నారు. వెంటనే పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బెదురు తిరుపతి, నాయకులు బొల్లు తిరుపతి,చిలుకల తిరుపతి, నకీర్తి రాజమల్లు, బొల్లు రవి, కాచగోని నర్సింహులు గౌడ్, బెదురు మల్లేశం, బొల్లు అంజి పాల్గొన్నారు.

కుంట ఎఫ్‌టీఎల్‌లో మట్టిని నింపుతున్న యజమానులు

- గతంలో కూడా పూర్తి స్థాయిలో మట్టిని నింపిన యాజమాన్యం
- అయినా పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- కనీసం మట్టిని తీసేసిన దాఖలాలు కూడా లేని పరిస్థితి





నవతెలంగాణ-మనోహరాబాద్

మట్టిని నింపడానికి కాదు ఏదీ అనర్హం అన్న చందంగా తయారైంది. తూప్రాన్ మనోహరాబాద్ మండలాల్లోని మట్టి వ్యాపారుల పరిస్థితి. మట్టిని నింపడానికి కుంటలు, చెరువులను కూడా మట్టి వ్యాపారులు వదలడంలేదు. ఇరు మండలాల్లో అంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. గతంలో కూడా ఇదే పరిశ్రమ యాజమాన్యం కుంట ఎఫ్‌టీఎల్‌లో పూర్తి స్థాయిలో మట్టిని నింపడంతో గ్రామస్థులు వ్యతిరేకించినప్పటికి ఇరిగేషన్ అధికారులు మాత్రం కనీసం ఒక టిప్పర్ మట్టిని కూడా తీయలేని పరిస్థితి. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఇరు మండలాల్లో చెరువులు కుంటలు కబ్జాలకు గురౌతున్నట్టు ప్రజలు తెలుపుతున్నారు. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో రొడ్డాయ కుంటకు పక్కనే హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యాపారులు భూమిని కొనుగోలు చేసి పరిశ్రమలను నిర్మించారు. పరిశ్రమ పక్కనే ఉన్న రొడ్డాయకుంట శిఖం భూమిలో పెద్ద ఎత్తున మట్టిని పోసి చదును చేసి కబ్జాకు గురిచేశారు. దాంతో గ్రామ ప్రజలు నాయకులు దానిని తీవ్రంగా వ్యతిరేకించి కుంట కబ్జాకు గురైతే నీరు ఎక్కడికి పోతాయని, దాంతో నీరు లేక వ్యవసాయ బోర్లు ఎండిపోయే పరిస్థితి ఉంటుందని గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. దాంతో ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వచ్చినప్పటికి పరిశ్రమ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వదిలేశారు. దానిని అదునుగా తీసుకున్న పక్కనే ఉన్న మరో పరిశ్రమ యజమాని తనకు ఉన్న శిఖం భూమిలో రాత్రి సమయంలో అదునుచూసి కొన్ని టిప్పర్ల ద్వార మట్టిని నింపుతున్నారు. దానికి గ్రామంలోని కొందరు మట్టి వ్యాపారులు సహకరిస్తున్నట్టు గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికి ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు కదా అక్కడ పోసిన మట్టిని సైతం తీసేయలేని పరిస్థితి నెలకొంది. కుంటల కబ్జాకు గురికావడానికి ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామ ప్రజలు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చట్ట వ్యతిరేకంగా శిఖం భూమిలో పోసిన మట్టిని తీసేసి శిఖంను కాపాడాలని ముప్పిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయికారి ఒప్పందం

- బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేయాలి
- నీలం మధుది నైతిక విజయం
- పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు
- మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్
- నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లోపాయి కారి ఒప్పందం చేసుకోవడం వల్ల బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు మెదక్ ఎంపీగా విజయం సాధించారని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డిలు అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తెర వెనక రాజకీయం చేసి బీజేపీతో కుమ్మక్కై బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావును గెలిపించారని విమర్శించారు. సిద్దిపేట నుంచి బీఆర్ఎస్ అభ్యర్థికి లక్ష మెజారిటీ అందిస్తానని మాజీ మంత్రి హరీష్ రావు ప్రకటనలు చేసి కేవలం 2 వేల మెజార్టీ అందించడమే అందుకు నిదర్శనమని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీమంత్రి హరీష్ రావులు బీజేపీతో రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేయాలని వారు సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు నర్సాపూర్ నియోజకవర్గం నుంచి 18 వేల భారీ మెజార్టీ అందించడం జరిగిందన్నారు. అందుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నైతికంగా విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్ రెడ్డి, సువాసిని రెడ్డి, శ్రీనివాస గుప్తా, మాజీ ఎంపీపీలు లలిత నర్సింగ్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, నాయకులు మల్లేశం, హకీం, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ గౌడ్, వెంకటేశం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నీలం నిర్లక్ష్యమే నిండా ముంచింది



నవతెలంగాణ-నిజాంపేట

నీలం మధు నిర్లక్ష్యమే నిండా ముంచిందని నిజాంపేట మండలంలో కొందరు చర్చించుకుంటున్నారు. నీల మధు ప్రచారం కూడా ఎక్కువ చేయలేకపోయారని కేవలం పట్టణాలకే పరిమితమయ్యారని పలువురు వాపోతున్నారు. మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రచారం చేసినట్లయితే ఆయన తప్పకుండా గెలిచేవారని పలువురు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు అనే వ్యక్తి ఎట్లా ఉంటాడో ఏమో ముఖం కూడా చూడలేదంటూ ఓటు ఎట్లా వేసేదని పలువురు ఓటు వేయలేదని చర్చ కొనసాగుతున్నది. పట్టణాలే కాకుండా మండలాలు గ్రామాలు కూడా ముఖ్యమే అని పలువురు వాపోతున్నారు. కేవలం 35 వేల పైచిలుకు మెజార్టీతో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు గెలిచారని, మండల కేంద్రాలలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు పర్యటించినట్లయితే సునాయసంగా గెలిచేవారని పలువురు వాపోతున్నారు. రఘునందన్ రావు ఎన్నికలలో గెలుపోటములను చవిచూసిన, వ్యక్తి కాబట్టి ఆయన ముందు జాగ్రత్తగా అన్ని మండలాలను తిరిగి కవర్ చేయడం వల్లనే గెలవడం జరిగిందని పలువురు పేర్కొంటున్నారు.

టీడీపీ కూటమి విజయం జగన్ అహంకారానికి పరాకాష్ట

- మెదక్ పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు ఇళ్లేందుల రమేష్



నవతెలంగాణ-చేగుంట

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలలో వైయస్ జగన్మోహన్ రెడ్డి అహంకార పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, మెదక్ పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ ఇల్లందుల రమేష్ పేర్కొన్నారు. బుధవారం చేగుంట విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కూటమి 164 సీట్లతో అఖండ విజయం చరిత్రలో నిలిచిపోతుందని హర్షం వ్యక్తం చేశారు. ఇది జగన్ అహంకారానికి, నియంత పాలనకు పరాకాష్ట అని తెలిపారు. ఏ పని చేయని మంత్రి పదవులు కొనసాగుతు, ప్రజలకు అందుబాటులో ఉండాల్సింది పోయి, బుల్లితెరలో నటిస్తూ జీవనం కొనసాగిస్తున్న రోజాకు మంత్రి పదవి ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, పార్టీఅధినేత చంద్రబాబు నాయుడు 4వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ శ్వీకారం సందర్భంగా తమ అధినేతకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో చంద్రబాబునాయుడు క్రియాశీలక పాత్ర పోషిస్తారని, తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి పాటుబడతారని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణాలో తెలుగుదేశం పార్టీ ముఖ్యపాత్ర పోషిస్తుందని తెలిపారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని బలోపితం చేస్తామని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రం ద్వారా బడిబాట కార్యక్రమం

- మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడి కేంద్రంలో చేర్పించాలి
- ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి



నవతెలంగాణ-వెల్దుర్తి

మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధి చేరిలా గ్రామంలోని అంగన్వాడి కేంద్రం ద్వారా బడిబాట కార్యక్రమాన్ని అంగన్వాడి టీచర్ దేవలత లక్ష్మీ పిల్లలు తల్లిదండ్రులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ వరలక్ష్మి మాట్లాడారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించడం ద్వారా ఆరోగ్యకరమైన పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించబడుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు ఆట వస్తువులతో ఆడించడం ద్వారా వారి మానసిక స్థితి మెరుగుపడుతుందన్నారు. చిన్నారులకు మెరుగైన ఆరోగ్యం మంచి విద్యతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ఆమె తెలిపారు. కిడ్స్ కేర్‌ని తలపించే అమ్మను మరిపించే అంగన్వాడి కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిరోజు ఉచిత భోజనం స్నాక్స్, గుడ్డు ఉచితంగా అంగన్వాడి కేంద్రంలో అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ కృష్ణవేణి, ఏఎన్ఎం స్రవంతి, ఆశ మంజుల పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌కు విరాళం అందజేసిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో ఆరోగ్యమే మహాభాగ్యం అనే గ్రూపు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం కోసం విరాళాలు సేకరిస్తున్నారు. నిజాంపేట గ్రామస్తులందరూ యువకులు కాకుండా ఎవరైనా వచ్చి ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసుకోవచ్చన్నారు. ఇందులో భాగంగానే జెడ్పీటీసీ పంజా విజయకుమార్ రూ.30 వేలు ఆ టీంకు అందజేయడం జరిగింది. గ్రామ వార్డు మెంబర్ ఆముద రాజు కూడా తన వంతు సహాయంగా రూ.11,311 అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఓపెన్ జిమ్ము ఏర్పాటు చేయడం వలన గ్రామస్తులు ఆరోగ్యంగా తయారవుతారన్నారు. రాజకీయాలకు సంబంధం లేకుండా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందజేయవచ్చున్నారు. అదేవిధంగా గ్రామ యువకులు కూడా గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నప్పుడే కొందరు ఆర్థిక సహాయం అందజేస్తారని ఆ విధంగా కాకుండా ఎప్పుడు ఎవరికి అవసరాలు పడతాయో అప్పుడు ఆర్థిక సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బట్ట మహేష్, జీడి తిరుపతి గౌడ్, చీకోటి వెంకటేశం, శెనగపల్లి తిరుపతి, జిపి స్వామి, బూరుగుపల్లి శివ, జాల పోచయ్య, గేరుగంటి బాబు, బజారు వినయ్ గౌడ్, పాల్గొన్నారు.

రఘునందన్ విజయానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు

- బీజేపీ రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, రఘువీరారెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ తరపున ఎంపీగా రఘునందన్ రావు విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి బీజేపీ రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, రఘువీరా రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం వారు నర్సాపూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు డబ్బు, మద్యంతో ప్రలోభ పెట్టినా వారికి లొంగకుండా ప్రజలు బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావును మెదక్ ఎంపీగా పట్టం కట్టారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో బీజేపీకి చెందిన వార్డు మెంబర్లను, సర్పంచులను, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను అత్యధికంగా గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరవింద్ గౌడ్, శంకర్, బాలరాజ్, ఎల్లం, నాగేష్, నారాయణరెడ్డి, బీక్షపతి పాల్గొన్నారు.

ఎంపీలను కలిసి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర నాయకులు





నవతెలంగాణ-మనోహరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన ఎంపీలను మనోహరాబాద్ మండల బీజేపి రాష్ట్ర నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ ఎంపీగా భారీ మెజారిటీతో గెలుపొందిన మాదవనేని రఘునందన్‌రావ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి నియోజక వర్గం నుంచి భారీ మెజారిటీతో గెలుపొందిన ఈటెల రాజెందర్‌లను మనోహరాబాద్ మండల బీజేపి పార్టీ రాష్ట్ర నాయకులు బాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్‌లు బుధవారం వారి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు వారు అభినందనలు తెలిపినట్టు వారు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని అలాగే ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నాయకులు ముందుండాలని తెలిపినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల వైస్ ప్రసిడెంట్ జగన్, సురేష్‌లతో పాటు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

మిని బస్సు బోల్తా, పలువురికి గాయాలు







నవతెలంగాణ-నార్సింగి

వారణాసిలోని కాశీ విశ్వనాథుని దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా మినీ బస్సు బోల్తా పడి పలువురికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని వల్లూరు గ్రామ శివారు 44 జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి, హైదరాబాద్‌కు చెందిన 21 మంది యాత్రికులు గత నెల 24వ తేదీన రైల్లో ప్రయాణమయ్యారు. లక్నోలో మినీ ట్రావెల్ బస్సును (డీఎల్ 1వీసీ 5079) అద్దెకు తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. కాశీ క్షేత్రములో దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా నార్సింగి మండల పరిధిలోని 44వ జాతీయ రహదారి వల్లూరు గ్రామ శివారుకు చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న మిని బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జ్యోతి, పూర్ణ, ఉమా, సుబ్రహ్మణ్యం, రాధిక, వెంకట్రెడ్డి, నిర్మల, రమణతో పాటు పలువురికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారికి నార్సింగి పోలీసులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దిన్ సిబ్బందితో పాటు రోడ్డుపై బోల్తా పడిన మిని బస్సును తొలగించి ట్రాఫిక్‌కి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

ఏకరూప దుస్తులను పరిశీలించిన డీఆర్డీఓ శ్రీనివాసరావు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని కుట్టు కేంద్రంలోని విద్యార్థుల దుస్తులను డీఆర్‌డీఓ శ్రీనివాస రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి, సెక్రటరీ సందీప్ సుకన్య ఆదేశానుసారం మెదక్ జిల్లాలోని చేగుంట, హవేలి ఘనపూర్, మెదక్, నార్సింగి, నిజాంపేట, రామాయంపేట, శంకరంపేట (ఆర్), తూప్రాన్, వెల్దుర్తి, మండలాల విద్యార్థులకు దుస్తులను అందించడమే ఏకైక లక్ష్యంగా మహిళా సంఘాల చేత 800 మంది మహిళల చేత దుస్తులను కుట్టించడం జరుగుతుందన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వకుండా మహిళా సంఘాలకే దుస్తులను కుట్టడానికి ఇవ్వడంతో ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. జూన్ 8 వరకు ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలన్నారు. 15979 మంది బాలురు, 15359 మంది బాలికలు, మొత్తం 31338 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వెంకట్, డీపీఎం ప్రకాష్, ఎపిఎం రాములు, , సిసిలు సరూప, లక్ష్మి ,స్వామి, పద్మ స్వామీ , కుట్టు మిషన్ల కటింగ్ మాస్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
గురువారం | 06 జూన్ 2024 | www.navatelangana.com

ప్రపంచ పర్యావరణ దినోత్సవ కరపత్రం ఆవిష్కరించిన డీఈఓ



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తన కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం మానవాలితో పాటు ప్రాణకోటికే ప్రమాదమని అన్నారు. ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకం నిషేదించాలన్నారు. అడవులు భూమతకు ఊపిరితిత్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లింగ శ్రీనివాస్, కోశాధికారి వెల్దండ మహిపాల్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి భాస్కర్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నందిని భగవాన్ రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



నవతెలంగాణ -నంగునూరు

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని పంచాయతీ కార్యదర్శి చంద్రకళ పిలుపునిచ్చారు. బుధవారం నంగునూరు మండల కేంద్రంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లను పెంచుదాం, భూమిని కాపాడుదాం, సురక్షితంగా జీవిద్దామని పేర్కొన్నారు. నేటి మొక్కలే రేపటి వృక్షాలుగా మారి భవిష్యత్ తరాలకు కావలసిన ఆక్సిజన్ అందిస్తాయని ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింగరావు, మేట్లు కూలీలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మల్లు రవి విజయం పట్ల హర్షం



నవతెలంగాణ-దుబ్బాక

నాగర్ కర్నూల్ లోక్ సభ స్థానం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ఎంపీగా ఘన విజయం సాధించడం పట్ల యూత్ కాంగ్రెస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు బురాని శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం దుబ్బాకలోని సీఎస్ఆర్ క్యాంప్ కార్యాలయంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్న 6 గ్యారంటీల పట్ల తెలంగాణ ప్రజలు సుముకత వ్యక్తం చేశారని, తెలంగాణలో 8 ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవడం కాంగ్రెస్‌కు శుభపరిణామన్నారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



నవతెలంగాణ-మద్దూరు

ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మండలంలోని సలాక్‌పూర్, మర్మముల, రేబర్తి, గ్రామాలలో ఎంపీడీవో రామ్మోహన్, ఆధ్వర్యంలో అమృత్ సరోవర్ చెరువుల వద్ద ఆయా గ్రామాలలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు ప్రజలకు చెట్ల పెంపకం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, ఈసీ పరశురాం, టిఏలు, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, కిరణ్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

రాష్ట్ర మాజీ సీఎం చంద్రశేఖర్ రావును బుధవారం హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్ ఎర్రవెల్లిలోని ఫావమ్‌హౌలో మర్యాద పూర్వకంగా కలిశారు. హుస్నాబాద్ ప్రాంతలోని వివిధ అంశాలపై చర్చించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు



నవతెలంగాణ-కొండపాక

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్ని కొండపాక ఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు అన్నారు. కొండపాక గ్రామంలో జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు పెంచకపోవడంతో ప్రస్తుతం మనం వేసవి కాలంలో ఎంత ఇబ్బంది పడుతున్నామో అర్థమవుతుందని, పర్యావరణం పచ్చదనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. పూర్వకాలంలో ఆకులతో తయారుచేసిన విస్తార్లలో భోజనం చేసేవారమని అప్పుడు ఆరోగ్యంగా ఉన్నామన్నారు. ప్లాస్టిక్ మయంతో అందరం ఆనారోగ్యం పాలవుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న పలువురు మహిళలు పాల్గొన్నారు.

7న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం 11 గంటలకు ఎంపీపీ మంచాల అనసూయ కనకరాములు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. అధికారులు తమ తమ నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

తెలంగాణాలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం

- హుస్నాబాద్‌లో తెలుగు తమ్ముళ్ల సంబరాలు
- హుస్నాబాద్ నియోజకవర్గ ఇంఛార్జ్ బత్తుల శ్రీనివాస్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తెలంగాణాలోతెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చే విధంగా పనిచేస్తామని టీడీపీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇంఛార్జ్ బత్తుల శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అఖండ మెజారిటీతో గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అరాచక పాలనకు స్వస్తి పలికి, టీడీపీ జనసేన బీజేపీ కూటమి ఆఖండ విజయం సాధించిందన్నారు. తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి చరిత్ర సృష్టించబోతున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తుల శశంకర్, ఎండి హసన్, ఆకుల వెంకటేష్, వరుకోలు రవీందర్, నర్సారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్



నవ తెలంగాణ-రాయపోల్

రాయపోల్ మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతకింది మంజూర్ మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకొని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ బుధవారం రాయపోల్ లో మంజూర్‌ను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంజూర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్ మాట్లాడుతూ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా తాము వెంటనే స్పందించి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామన్నారు. గత 30 సంవత్సరాల నుంచి పదవి ఉన్నా లేకున్నా పేదల పక్షాన ఉంటూ కృషి చేయడం జరుగుతుందన్నారు. పేదలకు సేవ చేయడంతోనే సంతోషం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అలాగే రాయపోల్ మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాల సత్తయ్య కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పేదలకు ఎలాంటి ఆపద వచ్చినా తనకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే పార్టీలకతీతంగా మానవత్వమే లక్ష్యంగా పనిచేస్తూ పేదల పక్షాన ఉంటామని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ వైపు నిలిచిన నిర్వాసితులు

- రెండో స్థానంలో బీఆర్ఎస్

నవతెలంగాణ-గజ్వేల్

ఎట్టకేలి మల్లన్న సాగర్ నిర్వాసితులు పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు నిలిచారు. మే 13న జరిగిన పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మెదక్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని గజ్వేల్ పట్టణంలో మల్లన్న సాగర్ నిర్వాసితులు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేశారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా మూడుసార్లు పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రెండుసార్లు ఓటు వేశారు. 2018 ఎన్నికల్లో రెండోసారి గెలిస్తే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించిన మల్లన్న సాగర్ నిర్వాసితులు కేసీఆర్ వైపు ఓట్లు వేశారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలకు దూరంగా ఉండి కేసీఆర్ పార్టీకి ఓటు వేసి గెలిపించారు. 2023 ఎన్నికల్లో మూడోసారి కూడా కేసీఆర్ అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని దీంతో తమ సమస్యలు తీర్చుతారని ఆశతో కాంగ్రెస్, బిజెపి పార్టీలను కాదని 90% నిర్వాసితులు భారత రాష్ట్ర సమితి పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను గెలిపించారు. కేసీఆర్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నిర్వాసితులు అధికార పార్టీకి దగ్గరయ్యారు. నిర్వాసితుల తరపున పోరాడుతున్న మల్లన్న సాగర్ నిర్వాసితుల పోరాట సమితి సభ్యులు అధికార పార్టీతో ఉండి మరిన్ని సమస్యలు ప్యాకేజీ తెచ్చుకునేలా ఉండాలనే ప్రయత్నంలోనే భాగంగా మెదక్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు కు అండగా నిలబడటం కనిపించింది. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడ్పల్లి భాస్కర్, మండల పార్టీ నాయకులు మల్లారెడ్డి, పట్టణ నాయకులు రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, నక్క రేగొండ తదితరులు ప్రచారం నిర్వహించారు. అంతేకాకుండా కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు సైతం మల్లన్న సాగర్ నిర్వాసితులను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్యాకేజీలు సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి



తీసుకపోయి పరిష్కారం చేసే దిశగా అడుగులు వేస్తానన్నారు. . దీంతో నిర్వాసితులు కాంగ్రెస్ వైపు నిలబడి ఓట్లు వేశారు. మెదక్ పార్లమెంటు పరిధిలో మల్లన్న సాగర్ పరిధిలో ఉన్న ఓట్లలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి 3,163 ఓట్లు పడగా, బీఆర్ఎస్ పార్టీకి.2,584, బీజేపీకి 1976 ఓట్లు వచ్చాయి. భారత రాష్ట్ర సమితి పార్టీ కన్నా కాంగ్రెస్‌కు వెయ్యి ఓట్లు ఎక్కువగా వేశారు.

గజ్వేల్‌లో వంటేరు మార్క్



- పార్టీని వదిలిన సీనియర్లు

నవతెలంగాణ-గజ్వేల్

మెదక్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని గజ్వేల్ నియోజకవర్గంలో ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి మార్క్ కనిపించింది. బీఆర్ఎస్ పార్టీ అధినేత గజ్వేల్ ఎమ్మెల్యేగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గంలో అన్నీ తానై వంటేరు ప్రతాప్ రెడ్డి నియోజకవర్గంలోని నాయకులను ఒక తాటిపైకి తీసుకువచ్చి 20 వేల మెజార్టీ సాధించినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీలో సీనియర్ నాయకులు ఉండి కార్పొరేషన్ పదవులు పొందిన ఎలక్షన్ రెడ్డి, భూమిరెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, తోపాటు నియోజకవర్గంలో తూప్రాన్, గజ్వేల్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిపోయారు. అయినా నియోజకవర్గం బాధ్యతలు మోస్తూ పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థి వెంకటరామిరెడ్డికి ఇతర నియోజకవర్గాల కన్నా మెజార్టీ తీసుకొచ్చారు. మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సూచనలు సలహాలు పాటిస్తూ 9 మండలాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించి మెజార్టీ తీసుకొచ్చారు. ఇదే పరిస్థితిలో గజ్వేల్ నియోజకవర్గం పై కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి నిరంతరంగా గజ్వేల్‌పై దృష్టి పెట్టి బీఆర్ఎస్‌కి ఎలాంటి మెజార్టీ రావద్దని



ప్రయత్నించి పార్టీ చేరికలను ప్రోత్సహించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి చాలామంది నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకున్నారు. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికల ముందు సైతం గజ్వేల్ నియోజకవర్గం చెందిన ముఖ్య నాయకులు అంతా బీజేపీ నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి ఈటల రాజేందర్ వైపు వెళ్లినప్పటికీ అప్పటి గజ్వేల్ అసెంబ్లీ అభ్యర్థి కేసీఆర్‌కు సైతం 45 వేల మెజార్టీ తీసుకురావడంలో వంటేరు కృషి ఉందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకటరామిరెడ్డిని గెలిపించాలని సుమారు రెండు నెలలు నియోజకవర్గాన్ని చుట్టివేశారు. ఓ పక్క పార్టీ నుంచి వెళ్ళిపోతున్న నాయకులను కార్యకర్తలకు నచ్చజెప్ప ప్రయత్నం చేసినా కొందరు నాయకులు పార్టీని వదిలి వెళ్ళిపోయారు. పార్టీలో ఉన్న వారితో వంటేరు ప్రతాప్ రెడ్డి పార్టీలో ఉన్న ముఖ్య నేతలను కలుపుకొని ముందుకు వెళ్లారు. దుబ్బాక ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేస్తున్న కొత్త ప్రభాకర్ రెడ్డి నియోజకవర్గంలో సైతం మెజార్టీ రాలేకపోయింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులు ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి పెట్టి వంటేరు ప్రతాప్ రెడ్డికి ఆదేశాలు ఇవ్వడంతోనే ఈ స్థాయిలో మెజార్టీ వచ్చిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రతాప్ రెడ్డి కృషి వల్లనే గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి 20 వేల మెజార్టీ వచ్చిందని పార్టీ అధిష్టానం భావిస్తుంది.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్ డిమాండ్



నవటతెలంగాణ-గజ్వేల్

ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్ మాట్లాడుతూ సంవత్సరానికి పుట్టగొడుగుల్లా కార్పొరేట్ విద్యాసంస్థలు పెరుగుతున్నాయన్నారు. వాటిని పట్టించుకునే నాధుడు లేకుండా పోతున్నారన్నారు. అక్షరాలకు లక్షల ఫీజులతో విద్య పేరు మీద వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల వారిపై చర్యలు లేవన్నారు. మాడ్యులాస్ శ్రీ చైతన్య బ్రాంచ్‌లు ఓకులే గల్లీకో బేబీ కేర్‌లు అని ప్రతి సంవత్సరానికి ఒక బ్రాంచ్ లెక్క పెరుగుతున్నా విద్యాశాఖ అధికారులు కళ్ళు మూసుకొని కాసులకు కక్కుర్తి పడి పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో అనుమతి ఇచ్చిన పాఠశాలలో కూడా ఎలాంటి సదుపాయలు లేవని అయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా పాఠశాల నడుపుతున్న వారికి పర్మిషన్ ఇచ్చి ప్రోత్సహిస్తున్న విద్యాశాఖ అధికారులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు కాసులకు లొంగకుండా పనిచేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, నాయకులు ప్రవీణ్, శేఖర్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో రైతులకు మేలు



నవతెలంగాణ-అక్కన్నపేట

వేసవికాలంలో దుక్కులను దున్ని పెట్టుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని ఏఈఓ శ్రీలత అన్నారు. బుధవారం అక్కన్నపేట మండలంలోని జనగామ గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలోనే దుక్కులను లోతుగా దున్నుకోవడం వల్ల భూమి లోపలి పొరలలోని నీరు ఆవిరైపోతుందని, దీనివల్ల చీడపీడల ఉధృతి కూడా తగ్గుతుందని అన్నారు. కాబట్టి ప్రతి రైతు వేసవిలోనే దుక్కులను లోతుగా దున్నుకోవాలని దీనివల్ల పడిన వర్షం భూమి లోపలి పొరల్లోకి వెళ్తుందని, దీనివల్ల సాగు సులభతరం అవుతుందన్నారు. కానీ కొంతమంది రైతులు పూర్తిగా వానలు కొట్టే వరకు దుక్కులను దున్నుకోవడం లేదని, దీనివల్ల కలుపు, గడ్డి జాతి మొక్కలు భూమిలోపలే ఉండి పోషక పదార్థాలను తీసుకుంటాయని తెలిపారు. ఈ టైంలో దుక్కులు దున్నించి పంట వేస్తే పంటలకు సరైన పోషక పదార్థాలు అందక చీడపీడల బారిన పడుతాయని తెలియజేశారు. కాబట్టి వేసవిలోనే దుక్కులను లోతుగా దున్నుకొని పెట్టుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలి

- నిబంధనలు పాటించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.
- మద్యం సేవించి వాహనాలు నడపవద్దు
- ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి.
- గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ప్రతి వాహనదారుడు రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో వాహనదారులకు ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మురళి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. మీరు మీ కుటుంబ సభ్యులను భార్య పిల్లలను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలని సూచించారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం రోడ్డు పైకి వస్తుందన్నారు. యజమాని లేని కుటుంబం చిన్నాభిన్నం అయిపోతుందని, ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పేర్కొన్నారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలని, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. రాంగ్ రూట్లో ప్రయాణిస్తున్నప్పుడు ప్రమాదం జరిగిన, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారి కైనా దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ క్లైమ్ చేయడం చాలా కష్టమవుతుందని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించి వాహనాలు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహన దారులు, తదితరులు ఉన్నారు.

టీడీపీ కూటమిది చారిత్రాత్మకమైన విజయం



నవతెలంగాణ-దుబ్బాక

ఆంధ్రాలో తెలుగుదేశం పార్టీ కూటమి సాధించింది చారిత్రాత్మకమైన విజయమని, ఈ తీర్పు జగన్ నియంత పాలన పట్ల చెంపపెట్టు లాంటిదని తెలుగుదేశం పార్టీ మెదక్ పార్లమెంట్ అధ్యక్షులు, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ ఇల్లందుల రమేష్ గుప్తా అన్నారు. బుధవారం దుబ్బాకలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇంతటి బ్రహ్మాండమైన మెజార్టీ సాధించినందుకు మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి శుభాకాంక్షలు తెలిపారు. రాబోవు రోజుల్లో తెలంగాణలోనూ టీడీపీ తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం





నవతెలంగాణ-మర్కుక్

అయిదేళ్ల పరిపాలనలో ప్రజలకు సేవ చేయడంలో సంతృప్తినిచ్చిందని మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్ అన్నారు. బుధవవారం మండల కేంద్రమైన మర్కుక్ ఎస్సీ ఫంక్షన్ హాల్ లో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, కొండ పోచమ్మ ప్రాజెక్టులో నీళ్ళను నింపి, రైతులను ఆదుకోవాలని కోరారు. వివిధ శాఖల ఆధికారులు వారి, వారి నివేధికలను సభ ముందు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, మర్కుక్ ఎంపీడీవో అఫ్జలుద్దీన్, డిప్యూటీ తహశీల్దారు బాగ్యరేఖ, ఏవో నాగేందర్ రెడ్డి, ఎంపీవో రాజ లింగం , ఏంఈవో ఉదయ భాస్కర్ రెడ్డి, ఎంపిటీసిల పోరం మండలాధ్యక్షులు రాజబోయిన కృష్ణ యాదవ్, ఎంపీటీసిలు గోలి నరేందర్, లక్ష్మీనర్సమ్మ, తుమ్మ ధనలక్ష్మి,, వివిధ శాఖల ఏఈలు అభిలాష్,తిర్మల్ రెడ్డి, సుదీర్, పాషా, డా.దీపా, పశువైద్యాధికారి రమేశ్, ఐసిడిఎస్ సూపర్ వేజర్ దుబేరరాణి, ఉపాదిహామీ టీఏ స్వామి, ఎంపిడివో కార్యాలయ సిబ్బంది ప్రభాకర్, జగన్, సిసి కవిత, తదితరులున్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు





నవతెలంగాణ-జగదేవపూర్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం" సందర్భంగా బీసీఐ ప్రాజెక్ట్ దేశ్ పాండే ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో వట్టిపల్లి గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ మేనేజర్ రాజేందర్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఉపయోగించిన పురుగుమందు డబ్బాలను, సింథటిక్ బ్యాగులను పునరుద్ధీకరించాలని, రసాయన మందుల వాడకాన్ని తగ్గించాలని, రోజు వారీ జీవితంలో నిత్యావసరాల కొరకు సాంప్రదాయ ఉత్పత్తులైన మట్టి కుండలను, స్టీల్ పాత్రలను వాడాలని తెలియజేశారు. ఇలా చేయడం వలన కొంత మేరకు పర్యావరణ రక్షించవచ్చన్నారు. కాలుష్యాన్ని, ప్లాస్టిక్ వస్తువుల ఉపయోగాన్ని తగ్గించి, కాలుష్యాన్ని, జీవవైవిద్యాన్ని మెరుగుపరచవచ్చునని బీసీఐ రైతులకు, కో ఫార్మర్స్‌కు, రైతు కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో కలిసి పలురకాల మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాజేందర్ , కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, ఫీల్డ్ ఫెసిలిటేటర్లు తప్పెట్ల కర్నాకర్, దుబ్బాసి రమేష్, తప్పెట్ల రాములు, పంచాయతీ సెక్రటరీ, అంగన్ వాడి టీచర్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొనడం తదితరులు ఉన్నారు.

యన్‌సీసీ క్యాంప్‌లో వ్యక్తిత్వ వికాస తరగతులు

- కల్నల్ రాజా దత్త





నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ బాలుర విద్యా సముదాయంలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యన్‌సీసీ సంయుక్త శిక్షణా శిబిరంలో ఐదవ రోజు శిక్షణ యోగా, కవాతు ద్వారా ప్రారంభమైంది. తర్వాత సంగారెడ్డి బెటాలియన్ మాజీ యన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాజాదత్త వక్తగా కాడేట్‌లకు "వ్యక్తిత్వ వికాసం" పైన ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పీ మధుసూదన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్నల్ రాజాదత్తా మాట్లాడుతూ స్ట్రెస్ మేనేజ్మెంట్, టైం మేనేజ్మెంట్, ఇంటర్వ్యూ లను ఎదుర్కునే విధానం, స్టేజ్ ఫియర్ ఆర్మీ ఆఫీసర్ ఉత్తీర్ణత పరీక్ష అయిన సర్వీస్ సెలక్షన్ బోర్డు నందు ఎంపికకు కావలసిన మెళకువలను వివరించారు. అదేవిధంగా ఫైరింగ్ సిములేటర్ ఫైరింగ్‌లో దాదాపు రెండు వందల కాడేట్‌లు పాల్గొన్నట్లు యన్‌సీసీ అధికారి అజేయ్ కుమార్ తెలిపారు.

వల్లి దేవసేన సుబ్రమణ్య స్వామి క్షేత్రంలో కృత్తికా మహోత్సవం



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ విద్య సరస్వతి దేవాలయం దగ్గరలోని వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి వారికి కృత్తికా నక్షత్రం సందర్భంగా కృత్తికా మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి అంకురార్పణ చేశారు. కృత్తికా మహోత్సవం సందర్భంగా స్వామివారికి లక్ష పుష్పార్చన, అభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. కృత్తికా మహోత్సవం సందర్భంగా స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామివారి సేవలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ అర్చకులు తెలిపారు

నవతెలంగాణ
5
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం | 06 జూన్ 2024 | www.navatelangana.com

మిరుదొడ్డిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

నవతెలంగాణ-మిరుదొడ్డి



దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో 300 మొక్కలను నేడు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నాటారు. మానవాళి మనుగడకు చెట్లు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పహిమ్, పలువురు పాల్గొన్నారు

విద్యుదాఘాతంతో గేదే మృతి

ప్రభుత్వం అదుకోవాలి రైతు వేడుకోలు

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని యూసఫ్ ఖాన్ పల్లిలో గ్రామానికి చెందిన రైతు సామల రాజు గేదే బుధవారం ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. సామల రాజు గేదేలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రూ. లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. తమను ప్రభుత్వం అందుకోవాలని ఆయన కోరారు.

మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు అభినందనలు

నవతెలంగాణ-రాయపోల్



మెదక్ పార్లమెంట్ సభ్యులుగా మాధవనేని రఘునందన్ రావు గెలుపొందడం హర్షించదగ్గ విషయమని ఉమ్మడి దౌల్తాబాద్ మండల మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింలు అన్నారు. బుధవారం రఘునందన్ రావు నివాసంలో మర్యాదపూర్వక కలసి బిజెపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ దేశానికి బిజెపి పార్టీయే రక్షణ అని ప్రజలు నమ్మారన్నారు. కాబట్టే ఎన్డీఏ కూటమికి అధికారం కట్టబెట్టారన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో మెదక్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు మెదక్ నియోజకవర్గం ప్రజలు రఘునందన్ రావుకు అవకాశం కల్పించారన్నారు. మెదక్ నియోజకవర్గ ప్రజల తరపున రఘునందన్ రావుకి ప్రత్యేక అభినందన లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ బాధితుడికి అందించిన ఎస్ఐ



నవతెలంగాణ-రాయపోల్

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ సీఈఐఆర్ టెక్నాలజీతో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తిరిగి బాధితుడికి అప్పగించడం జరిగిందని ఎస్సై రఘుపతి అన్నారు. బుధవారం రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడికి మొబైల్ ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన దయ్యాల నరేష్ మూడు నెలల క్రితం వడ్డేపల్లికి వెళ్లే మార్గమధ్యంలో పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వెబ్సైట్లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేశారు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం రాగానే ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, పోగొట్టుకున్న వ్యక్తికి ఫోన్ అందజేయడం జరిగిందన్నారు. పోలీసుల సేవల పట్ల ఫిర్యాదుదారుడు సంతృప్తి వ్యక్తం చేస్తూ పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్న గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనంగా ఎత్తుకొనిపోయిన, వారు వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్) పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చుని, తద్వారా కోల్పోయిన మొబైల్ ఫోన్ తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ పోర్టల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

- పలువురి అరెస్ట్

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట పట్టణం మైత్రివనంలోని ఒక ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటి యజమానురాలితో పాటు, ఒకవిటుడు, ఒక మహిళను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్, త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మైత్రివనంలో ఉండే ఓ మహిళ తన ఇంటిలో వేరే ఆడవారిని తీసుకొని వచ్చి వ్యభిచారం చేస్తుందన్న సమాచారంతో దాడి చేసి సంకోజు మహేష్ అనే వ్యక్తితో పాటు, ఒక మహిళను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1470 లు, 3 సెల్ ఫోన్స్, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. .

8న యాదగిరిగుట్ట బస్సు సర్వీసు ప్రారంభం

నవతెలంగాణ-దుబ్బాక

ప్రముఖ పుణ్యక్షేత్రం, తెలంగాణ తిరుపతిగా పిలువబడే యాదగిరిగుట్ట క్షేత్రానికి దుబ్బాక నుంచి సిద్దిపేట మీదుగా బస్సు సర్వీసును నడుపుతున్నట్లు సీనియర్ ట్రాఫిక్ సూపర్ వైజర్ కనకలక్ష్మి తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5 గంటలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సును దుబ్బాక బస్సు డిపో మేనేజర్ వై.సుకేందర్ రెడ్డి సూచనల మేరకు ఈ నెల 8న ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని, దుబ్బాక పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దుబ్బాక డిపోను ఆదరించాలని కోరారు.

వెంకట్రామిరెడ్డి ఓటమి చెందడం బాధాకరం

- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగం

నవతెలంగాణ-మిరుదొడ్డి



బీఆర్ఎస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేసినప్పటికీ ఓటమి చెందడం బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగం అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ పార్టీ నుంచి రాజకీయ పార్టీగా ఎదిగిన బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో భిన్న ఫలితాలు రావడం నిరాశ కలిగించినప్పటికీ కార్యకర్తలు, నాయకులు అధైర్యపడవద్దని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించినందుకు కార్యకర్తలు సన్నదం కావాలన్నారు. గెలుపోటములు రాజకీయంలో సహజమని, ఎంపీ ఎలక్షన్లో వెంకటరామిరెడ్డికి ఓట్లు వేసిన దుబ్బాక నియోజకవర్గం కార్యకర్తలకు , ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొట్టం రాధాకృష్ణ, గొల్ల రాములు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్

నవతెలంగాణ-మిరుదొడ్డి



మెదక్ లోక్ సభ ఎన్నికల ఫలితాలలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమన్నారు. తెలంగాణలో బీజేపీని గెలిపించడానికి బీఆర్ఎస్ పార్టీ తనకు తాను ఆత్మహుతి అయ్యిందని ఎద్దేవా చేశారు. ప్రజల బాగు కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో దుబ్బాకను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం నీలం మధు ముదిరాజ్ ఓట్లు వేసిన ప్రజలకు, వారి విజయం కోసం కష్టపడిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పేరు పేరునా ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

గర్భిణీ స్త్రీలకు సేవలందిస్తున్న ఆసుపత్రి

నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ ప్రాంతంలోని మాతా శిశు జిల్లా ఆస్పత్రి అప్పటి ప్రభుత్వం గజ్వేల్ పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని రూ.29 కోట్లు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వరకు ప్రధాన రోడ్డు మార్గంగా ఎక్కడ మాతా శిశు జిల్లా ఆస్పత్రి అందుబాటులో లేకపోవడం వల్ల అప్పటి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టితో ఆసుపత్రిని గజ్వేల్లో ఏర్పాటు చేశారు. ఐ రిస్క్ కేంద్రం ఏర్పాటు నుంచే గర్భిణీ స్త్రీలు ఆపరేషన్ల కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బారులు తీరడం ప్రారంభించారు. రోజుకు 15 వరకు ఆపరేషన్లు చేస్తున్నారు. నార్మల్ డెలివరీ కూడా10 ఇక్కడనే కావడం వల్ల స్థానిక వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులు చేస్తున్నారు. అంతేకాకుండా బిసిజి ఇంజక్షన్ కోసం చిన్నారులను మరో 10 మంది వరకు ఇక్కడికి తీసుకొస్తున్నారు. శుక్రవారం, సోమవారం 200 మంది గర్భిణీ స్త్రీలు వచ్చి పరీక్షలు నిర్వహించుకుంటున్నారు. గజ్వేల్ నియోజకవర్గం కాకుండా దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్, కొమరవెల్లి, చేర్యాల, తూప్రాన్, మనోహరాబాద్, తొగుట, దౌల్తాబాద్, మిరుదొడ్డి, రాయపోల్, జగదేవ్పూర్ తదితర మండలాలతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి, కొండాపూర్ మండలాల నుంచి కూడా భారీ సంఖ్యలో గర్భిణీ స్త్రీలు గజ్వేల్ మాతా శిశు ఆసుపత్రికి రావడం కనిపిస్తుంది. అంతేకాకుండా మెదక్ జిల్లా నర్సాపూర్, చేగుంట, రామాయంపేట తదితర మండలాల నుంచి భారీ సంఖ్యలో గర్భిణీ స్త్రీలు వచ్చి టెస్టులు ఆపరేషన్ చేయించుకుంటున్నారు. వంద పడకల జిల్లా ఆసుపత్రి చిన్నారులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగింది.. ఆస్పత్రిలో ఆపరేషన్లు, ఆరోగ్య పరీక్షలు వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో చేస్తున్నట్లు ఆసుపత్రికి వస్తున్న ఆసుపత్రికి వస్తున్న గర్భిణీ స్త్రీల బంధువులు తెలిపారు.





గజ్వేల్ మాతా శిశు సంక్షేమ జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ రామ్, జ్యోతి, శాంతం రెడ్డి, డాక్టర్ మంజుల, డాక్టర్ త్రివేణి, శ్రీలత తదితర వైద్యులు ఇక్కడ సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం ఆపరేషన్లు, ఆరోగ్య పరీక్షలు చేస్తుండడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో గర్భిణీ స్త్రీల ప్రసవాలు తగ్గినట్లు ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బంది ద్వారా తెలుస్తుంది. గజ్వేల్ పట్టణంలో జనరల్ జిల్లా ఆసుపత్రితో పాటు జిల్లా చిల్డ్రన్ ఆసుపత్రి ఏర్పాటు చేయడం వల్ల గజ్వేల్ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం కనిపిస్తుంది. ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో అప్పటి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్‌లో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారని దీనితో మంచి వైద్య సేవలు అందుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. కాగా జిల్లా చిల్డ్రన్ ఆసుపత్రిలో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.

చేపల ఆటో బోల్తా, ఇరువురికి గాయాలు

నవతెలంగాణ-కొండపాక

చేపల ఆటో బోల్తాపడి ఇరువురికి గాయాలైన సంఘటన రాజీవ్ రహదారి లకుడారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఇల్లంతకుంట మండలం కట్క్యూర్ గ్రామం నుంచి చేపల లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న ఆటో లకుడారం శివారులో ఆటో టైర్ పగిలిపోవటంతో డివైడర్‌ని ఢీకొని రోడ్డు మీద పల్టీ కొట్టింది. ఆటోలో ఉన్న అజయ్ కుమార్ (35) ఎడమ చేయి విరగ్గా, సురేష్ (31)కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన సమాచారం తెలుసుకున్న కొండపాక '108' సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ మహేందర్, పైలట్ మల్లేష్ హుటాహుటిన ఘటన ప్రాంతానికి వెళ్లి





తీవ్రంగా గాయపడిన సురేష్‌కు అక్కడే ప్రాథమిక చికిత్స చేసి, చేయి విరిగిన అజయ్‌ని 108లో ప్రథమ చికిత్స చేస్తూ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు



ఈటెల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-నర్సాపూర్



మల్కాజ్‌గిరి ఎంపీగా ఈటెల రాజేందర్ గెలుపొందడంతో బుధవారం నర్సాపూర్ పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు హైదరాబాదులోని ఈటెల రాజేందర్ నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈటెల రాజేందర్‌ను కలిసిన వారిలో బీజేపీ నాయకులు ఎర్రగోళ్ల మురళీధర్ యాదవ్, బుచ్చేష్ యాదవ్, లతా రమేష్ యాదవ్, రాజేందర్, శ్రీనివాస్ గుప్తా, ఆశన్న గారి దేవేందర్ యాదవ్, ఆంజనేయులు గౌడ్, యాదగిరి, రమణారావు, సంఘసాని సురేష్ ఉన్నారు.

ఎంపికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-జగదేవపూర్



మెదక్ ఎంపీ ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించిన రఘునందన్ రావును బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం శ్రీధర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి గర్నెపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పార్టీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నియోజకవర్గ నాయకులు బుధవారం హైదరాబాదులో గల బీజేపీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్‌లో పార్టీ విజయం కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు, విజయాన్ని అందించిన ప్రతి ఓటర్ మహాశయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మెదక్ అభ్యర్థిగా గెలిపించిన మెదక్ వాసులందరికీ సేవ చేయడానికి మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొట్టాల మల్లేష్, కొంతం సుధాకర్, చంద్రశేఖర్ రెడ్డి, సురేష్, కరుణాకర్ రెడ్డి ఉన్నారు.

నిషేధిత వస్తువులు అమ్మితే చర్యలు తప్పవు

- గుట్కాలు, అంబర్,బ్లూ బుల్ ఎడి బ్లాక్ సిగరెట్లు పట్టివేత
- సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు అంబర్, బ్లూబుల్, ఎడి, బ్లాక్ సిగరెట్స్ క్రయ విక్రయాలు జరిపిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు హెచ్చరించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో నిషేధిత పదార్థాల స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో గర్గ్ సచిన్ అగర్వాల్, ఇమ్మడి రవికుమార్‌లు గుట్కాలు అంబర్ బ్లాక్ సిగరెట్లు అమ్ముతున్నారని పక్క సమాచారంతో రైడ్ చేశామన్నారు. పట్టణంలో నిందితులిద్దరూ హోల్ సేల్ కిరాణా షాపులలో ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, బ్లాక్ సిగరెట్స్ అమ్ముతున్నారని నిర్దారణ చేశామన్నారు. టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది గజ్వేల్ పోలీసులు కలసి కిరాణా షాపులో తనిఖీలు నిర్వహించగా ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు అంబర్, బ్లూబుల్, గుట్కా ప్యాకెట్లు బ్లాక్ సిగరెట్స్ మొత్తం విలువ రూ.1 లక్ష 20 వేల సామాగ్రి స్వాధీనం చే న ఎకు న్నా వ ను న్నా ర ు. నిందితులపై గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించరన్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ప్రభుత్వం నిషేధించిన గుట్కాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.గ్రామాలలో,పట్టణాలలో ఇసుక, అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన సమాచారం ఇవ్వాలన్నారు. రవాణా గ్యాంబ్లింగ్, పేకాట, ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు కలిగి ఉన్నా రవాణా చేసిన ఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే ఉరుకునేదిలేదన్నారు. వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది గజ్వేల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం

- చేబర్తి పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్

నవతెలంగాణ-మర్కుక్

ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినప్పుడే మానవాళి ఆరోగ్యంగా ఉంటుందని చేబర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్‌ను నిషేధించాలని మోదుగు ఆకులతో విస్తారాకులను తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించాలన్నారు. భావితరాలకు మంచి వాతావరణం అందించాలంటే అందరూ మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. ప్రతిరోజు ఇంట్లో ఉండే తడి, పొడి చెత్తను వేరే చేసి వేయాలన్నారు. ఈ చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి మొక్కలకు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈడబ్ల్యూఐడీసి ఏఈ రాజేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఉప సర్పంచ్ స్వామి, నాయకులు జయరాం, అంగన్‌వాడీ టీచర్లు,ఫీల్డ్ అసిస్టెంట్ లలిత, ఉపాది హామీ కూలీలు, తదితరులున్నారు.



నర్సాపూర్‌లోశ్రీ రేణుక ఎల్లమ్మ 13వ వార్షికోత్సవ ఉత్సవాలు

ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన గౌడ సంఘం సభ్యులు

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ 13వ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలను ఈ నెల 11, 12వ తేదిలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ గౌడ సంఘం సభ్యులు తెలిపారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో 13వ వార్షికోత్సవాల వాల్ పోస్టర్‌లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతి పూజ, పుణ్యావచనం, నవగ్రహ పూజా, రుత్విక్వాహనం, ద్వజారోహణం, వాస్తు గృహ, సర్వతోభద్ర మంటపారాధన, అగ్ని ప్రతిష్టా, జలాభిషేకంతో పాటు మధ్యాహ్నం శ్రీ జమదగ్ని సహిత రేణుకా దేవి కళ్యాణం తీర్థప్రసాద, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. బుధవారం చండీ హవనం, సామూహిక కుంకుమార్చనలు, పూర్ణాహుతి మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ అన్నదాన కార్యక్రమం సాయంత్రం బోనాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. ఈ ఉత్సవాలు ఆలయ పూజారి మురళీకృష్ణ పంతులు ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. నర్సాపూర్ పట్టణంలో జరిగే శ్రీ రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవ ఉత్సవాలకు భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, సభ్యులు సత్యం గౌడ్, విజయ్ గౌడ్, రామకృష్ణ గౌడ్, అనిల్ గౌడ్, వెంకటేష్ గౌడ్, సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై జాగ్రత్త వహించాలి

నవతెలంగాణ-కోహెడ

సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్త వహించాలని ఎస్సై సిహెచ్.తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ వద్ద గ్రామస్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పలువురు సైబర్ నేరస్థులు ఫోన్ చేసి తమ ఏటీఎం సంబంధిత వివరాలు తెలపాలని, బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని వివరాలను అడిగి తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని వారి భారిన పడి మోసపోవద్దని సూచించారు. అలాగే సెల్ ఫోన్స్ అవసరం మేరకు ఉపయోగించాలని, ప్రజలు సైబర్ నేరాలకు గురికావద్దని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు రెస్పాండ్ కావద్దని, బ్యాంక్ అధికారులమంటూ ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్ వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా చెప్పాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలను నడిపి ప్రమాదాలకు గురై కుటుంబాలను రోడ్డున వేయవద్దని సూచించారు. ఎప్పటికప్పుడు మండలంలో తనిఖీలు నిర్వహిస్తున్నామని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్య తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్‌లకు వాహనాలను తల్లిదండ్రులు అప్పగించవద్దని, ప్రమాదం జరిగితే కుటుంబం ఇబ్బందులకు గురవుతుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్‌లు లింగారెడ్డి, లక్ష్మణ్, కానిస్టేబుల్‌లు సిహెచ్.రమేష్, రమేష్ నాయక్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

